క్లుప్తంగా

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వేలేరు : జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన బైరగొని శ్రీధర్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేలేరు ఎస్సై అజ్మీరా సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలేరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తు న్నానని నమ్మించి ఆమెను శారీరకంగా లోబరుకున్నట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీధర్‌పై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచగా కోర్టు రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

రక్తదానం



వేలేరు : మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం కావాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ ఎంజీఎంకు వెళ్లి రక్తదానం చేశారు. దీంతో పలువురు అతడిని అభినందించారు.

గిరిజనులపై దౌర్జన్యాలు ఆపాలి

ఆత్మకూరు : కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో గిరిజనులపై ప్రభుత్వ దౌర్జన్యాలను తక్షణమే ఆపాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ ప్రధానకార్యదర్శి విజయేందర్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 11వ తేదీన జరిగిన ఘటన అనంతరం తమపై ఎవరూ దాడిచేయలేదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ గిరిజన రైతులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. ఫార్మా కంపెనీకి భూములు కట్టబెట్టే ఉద్దేశ్యంలో ప్రభుత్వం ప్రజలపై దాడులు చేస్తుందని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం



నక్క ప్రశాంత్ (ఫైల్)

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుడెప్పాడ్ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్తిపాకకు చెందిన నక్క ప్రశాంత్ (25) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై హనుమకొండకు వెళ్లి పనిపూర్తి చేసుకొని హనుమకొండలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి మీటింగ్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పత్తిపాకకు చెందిన మరో యువకుడు మొగ్గం నరేష్‌తో కలిసి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో గుడెప్పాడ్ సమీపంలో ఎదురుగా గుర్తు తెలియని వాహనం రాగా లైట్ల వెలుతురుకు సడన్ బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ తలకు బలమైన గాయం కాగా తనతో పాటు బైక్‌పై ఉన్న నరేష్‌కు స్వల్ప గాయమైంది. క్షతగాత్రులను స్థానికులు 108లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రశాంత్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా నరేష్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి నక్క రజిత బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

'ఆర్ట్స్' పీఆర్వోగా హరికుమార్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పీఆర్వోగా డాక్టర్ వేదాంతం హరికుమార్‌ను నియమించారు. ఈమేరకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి ఉత్తర్వులు జారీచేశారు.

పలువురుపై కేసు నమోదు

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. కారు ఢీకొట్టిన ఘటనలో ఎండీ.ఖాజాపాషా ఫిర్యాదు మేరకు ఎండీ.షఫీ, ఎండీ.సమత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మోసం చేసిన ఇద్దరిపై..

రామన్నపేట: రూ.2,500 నుంచి రూ.3,500ల వరకు చెల్లించిన వ్యక్తి మరో 500 మందిని చేర్పిస్తే రూ.13,500 నగదు చెల్లిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై..

ఖిలా వరంగల్: ఓ వ్యక్తిపై దుర్భాషలాడుతూ దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. వరంగల్ గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన దేసిని మధుసూదన్, పూజ దంపతులు అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14న రాత్రి వారిపై పక్కింటి వ్యక్తి నాగబాబు ఈ రాత్రి ఏం ముచ్చట్లు అంటూ దుర్భాషలాడుతూ రాడుతో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు.

విద్యార్థులే పాత్రికేయులుగా..



విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు



ప్రశ్నలు అడుగుతున్న విద్యార్థులు

- ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమం
- పలు ప్రశ్నలకు ఓపికగా టీచర్ల సమాధానాలు

ధర్మసాగర్: తరగతి గదిలో పాఠాలు, పరీక్షలు, ప్రాజెక్టులు, ఆటలతో తీరిక లేకుండా ఉండే విద్యార్థులు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం పాత్రికేయులుగా మారారు. సమాజంపై అవగాహన పెంపొందించాలనే భావనతో ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాశ్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులుగా మారిన విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఉపాధ్యాయులు ఓపికగా సమాధానాలు ఇచ్చారు.

విద్యార్థి (- ఎత్తిరి సిద్దు, పదవ తరగతి) : మన పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివద్ధి కోసం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా మీరు తీసుకునే చర్యలు ఏమిటి. ?

ఇన్‌చార్జ్ హెచ్‌ఎం : (ధర్మప్రకాశ్) విద్యార్థులంతా ఉదయం ప్రశాంతంగా పాఠశాలకు వస్తారు కాబట్టి అసెంబ్లీని నిర్వహిస్తున్నాం. తెలుగు, హిందీ, ఆంగ్లంలో జాతీయ, రాష్ట్రీయ, జిల్లా, గ్రామాల వారిగా తెలుసుకోవాల్సిన విషయాలను తెలుపుతున్నాం. అలాగే వివిధ క్లబ్ ద్వారా క్విజ్, వివిధ అంశాలపై పరీక్షలు నిర్వహించి వారిలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసున్నాం.

విద్యార్థి (-రిత, 9వ తరగతి): సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలంటే ఏం చేయాలి. పాఠశాల దశలోనే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ఎలా అలవర్చుకోవాలి.?

ఉపాధ్యాయులు (కవితాదేవి, సురేష్) : తరగతి గదిలో బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలి. సైన్స్‌ను చక్కగా అర్థం చేసుకోవాలి. ఫార్మెటీవ్ అసెస్మెంట్‌కు సంబంధించి ప్రయోగశాలలో ప్రయోగాలు చేయాలి. ప్రభుత్వం నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్, చెకుముకీ పోటీల్లో పాల్గొనాలి.

విద్యార్థి (రేణుక, 9వ తరగతి) : మన పాఠశాలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తయారు చేసేందుకు తీసుకునే చర్యలు ఏమిటి.?

అంగ్ల ఉపాధ్యాయుడు (ధర్మప్రకాశ్) : ఈ పాఠశాలలో చదువుకుని ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారు. అలాంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిషలు కృషి చేస్తున్నారు. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, భాషా సామర్థ్యాలు పెంపొందేలా శిక్షణ ఇస్తున్నాం. వివిధ అంశాలపై బృంద చర్యలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం.

విద్యార్థి (-మధుప్రియ, 9వ తరగతి): చాలా మంది విద్యార్థులు ఇంట్లో కుటుంబ సమస్యలు, మొబైల్ ఫోను, టీవీ, ఆన్‌లైన్ గేమ్స్ వలన చదువుపై దృష్టి వహించలేకపోతున్నారు. దీనిని అధిగమించేందుకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

ఉపాధ్యాయులు (పద్మజ, రాజమ్మ) : అన్ని సమస్యలకు పరిష్కారం మనం ఆలోచించే పద్ధతిలోనే ఉంటుంది. ఎన్ని సమస్యలు ఉన్నా క్రమశిక్షణతో చదువుపైనే దృష్టి సారించి పాఠశాలల్లో ఉపాధ్యాయుల చెప్పే నియమాలు పాటిస్తే ఒత్తిడి నుంచి బయటపడొచ్చు. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకోవాలి. కుటుంబ సమస్యలు పెద్దవాళ్లు చూసుకునే అంశం. వాటిని విద్యార్థులు పట్టించుకోకుంటే బెటర్.

విద్యార్థి (- కార్తీక్, 9వ తరగతి): గణితం చాలా క్లిష్టమైన సబ్జెక్టు అని అంటుంటారు. గణితం సులభంగా అర్థం అయ్యేందుకు ఎం చేయాలి.?

ఉపాధ్యాయురాలు (కిరణ్మయి) : గణితం అంటేనే చాలా మంది విద్యార్థులు భయపడతారు. కానీ గణితాన్ని అర్థం చేసుకుంటే చాలా సులభం. పాఠశాలలో నిర్వహించే వివిధ గణిత పోటీలు, నో బ్యాగ్ డే రోజు గణిత పజిల్స్, గణితానికి సంబంధించిన ఇతర పోటీల్లో పాల్గొని ఉపాధ్యాయులు ఇచ్చే హోం వర్క్‌ను శ్రద్ధగా పూర్తి చేస్తే గణితంపై భయం తొలిగిపోయి సలభంగా లెక్కల సాధన చేయొచ్చు.

హామీలు నెరవేర్చేవరకు 'కడియం'ను వదలం

- మాజీ జెడ్పీటీసీ సరిత



మాట్లాడుతున్న చాడ సరిత

వేలేరు : ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని, వదిలేది లేదని మాజీ జెడ్పీటీసీ చాడ సరిత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో కాంప్లెక్స్‌ల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టు పనులు, తండాలకు లింక్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ తదితర పనులు పూర్తిచేసి నియోజకవర్గ రూపురేఖలు మారుస్తాననే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తిచేయాలని తాము ప్రశ్నిస్తే అతని అనుచరులతో వ్యక్తిగత విమర్శలు చేయిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెబుతున్నారని, కానీ వ్యక్తిగత స్వార్థం కోసమే కడియం శ్రీహరి పార్టీ మారి నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేశారని విమర్శించారు. పదిహేను సంవత్సరాలు మంత్రిగా ఉండి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏంటో చూపాలని సవాల్ విసిరారు. వేలేరు అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వమే నిధులు కేటాయించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. కడియం శ్రీహరి అనుచరులే మండలంలో భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కోఆర్డినేటర్ గోవింద సురేష్, మాజీ వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, నాయకులు జాని, వీరయ్య, ప్రభాకర్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉండాలి



బ్యాంక్‌ను తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్

దామెర : బ్యాంక్‌లో నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉండాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని ఊరుగొండ ఏపీజీవీబీ బ్యాంక్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్‌లో సీసీ కెమెరాల పనితీరు, లాకర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ అధికారులు అప్రత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నిఘా వ్యవస్థను పటిష్టపరిచి సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట బ్యాంకు అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వానికి పట్టింపులేదు



పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

పరకాల : విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపులేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. వరంగల్‌లో సీఎం సభ సందర్భంగా జరిగిన అక్రమ అరెస్టులను నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో బుధవారం నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని, కానీ ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టులు చేస్తూ కేసులు నమోదు చేయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హేమంత్, ఈశ్వర్, నవీన్, అజయ్, మధుకర్, సాయితేజ, ఈశ్వర్, నవీన్, యశ్వంత్, అవినాశ్, ప్రశాంత్, వంశీ, సునీల్, భరత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సాయిరాం

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలకు చెందిన ఎస్.సాయిరాం జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కవితారెడ్డి తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సాయిరాం అండర్-17 షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ కనబర్చి ద్వితీయస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కాగా సాయిరాం ప్రస్తుతం మండల కేంద్రంలోని ఎంజేపీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి సాయిరాంను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

23న మహిళల కబడ్డీ జట్టు ఎంపికలు

కాశిబుగ్గ: వరంగల్‌లోని ఓసిటీ స్టేడియంలో ఈనెల 23న మహిళల జిల్లా సీనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, సహాయ కార్యదర్శి కె.మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 75 కిలోల లోపు బరువు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి



కమలాపూర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఐనవోలు : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



పరకాల : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



వేలేరులో..

కమలాపూర్ : రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ చిలువేరు శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 90 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు ఉన్నాయని తెలిపారు. వీరంతా విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేదలందరికి కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందించాలని, మెరుగైన ఉచిత వైద్యం అందించాలన్నారు. అర్హతను బట్టి ఉపాధి కల్పించి, సాగు నీటి సౌకర్యంతో కూడిన ఎకరం భూమి ఇవ్వాలని, అర్హులైన వారికి 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్మసమాజ్‌పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి సోమిడి నరేష్, రాజు, నాయకులు గట్టు మల్లు, తిరుపతి, శివాజీ, గోపి పాల్గొన్నారు.

ఐనవోలు : వెనుకబడిన బడుగు బలహీన వర్గాలకు, మధ్యతరగతి ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, ఇళ్లు, భూమి, ఉపాధిని కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మండల అధ్యక్షుడు కొత్తూరు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు కొత్తూరు కుమార్, ప్రధానకార్యదర్శి నస్కూర్ రాజేందర్, నాయకులు కొత్తూరు జయపాల్, కొత్తూరు అనిల్ పాల్గొన్నారు.

పరకాల : నిరుపేదలకు ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యంతో పాటు భూమి, ఉపాధి, ఇళ్లు అందజేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ భాస్కర్‌కు ఆ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. అర్హులైన నిరుపేదలకు ఉచిత విద్య, మెరుగైన వైద్య సదుపాయం అందించడంతో పాటు నాలుగు గదులతో కూడిన ఇంటి నిర్మాణం, ఎకరం భూమి, అర్హతను బట్టి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగ మహరాజ్, ప్రధాన కార్యదర్శి రవి మహరాజ్, సలీం పాషా, రత్నాకర్, తిరుపతి, ప్రశాంత్, బాలు పాల్గొన్నారు.

వేలేరు : అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్ర ప్రసాద్ బుధవారం తహసీల్దార్ హెచ్.కోమికి వినతిపత్రం అందించారు. నిరుపేదలకు విద్యా, వైద్యం, ఉపాధి కల్పించాలని వినతిలో కోరారు. జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం ఉచిత విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు అందించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కోడెపాక ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రత్నాకర్, తిరుపతి ఉన్నారు.

సామాజిక కులగణనకు సహకరించాలి



కులగణన సర్వేను పరిశీలిస్తున్న కరుణాకర్

దామెర : ప్రభుత్వం చేపట్టిన సామాజిక కులగణనకు సహకరించాలని డీబీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్ కోరారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో కులగణనపై బుధవారం ప్రచారం నిర్వహించారు. కులగణన సర్వే ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ, భూమి, ఉపాధి, విద్య తదితర వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అయన వెంట గ్రామపంచాయతీ కార్యదర్శి ధర్మారెడ్డి, మహిళా సంఘాల సభ్యులు నీరటి వినోద, దండు కమలమ్మ, లావణ్య ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఆత్మకూరు : విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని నీరుకుళ్ల జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ రమేశ్ అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో గల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు, బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అలాగే మా సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి నాగబండి శివప్రసాద్ పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందించారు. దాతలకు పాఠశాల ప్రిన్సిపాల్ దామెర అనిత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొరం తవ్వకాలు నిలిపివేయాలి



మైన్స్ ఏడీ నాగేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేస్తున్న కృపాకర్‌రెడ్డి

దామెర : మండల కేంద్రంలో కొంతకాలంగా చేపడుతున్న మొరం తవ్వకాలు వెంటనే నిలిపివేయాలి మాజీ ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, మైన్స్ ఏడీ నాగేశ్వరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలోని 393 సర్వే నంబర్‌లో గల భూమిలో కొంతకాలంగా నిర్విరామంగా మొరం తవ్వకాలు చేపడుతూ వందలాది టిప్పర్లతో తరలిస్తున్నారని అన్నారు. జాతీయ రహదారి కోసం తీసుకెళ్తున్నామంటూ స్థానిక ప్రజలను మభ్యపెట్టి ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి సమీపంలో తవ్వకాలు చేపడుతున్న కారణంగా గుంతలు ఏర్పడి అందులో నీరుచేరి పశువులు, ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆయన వినతిలో పేర్కొన్నారు.

నైపుణ్యాలు వెలికితీసేందుకు క్రీడలు దోహదం



బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు

రామన్నపేట: పిల్లలోని మెళకువలు, నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్ అన్నారు. ఆటోనగర్‌లోని బాలుర పరిశీలక గృహంలో బుధవారం నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలురకు ఖోఖో, కబడ్డీ, మ్యూజికల్ చైర్, క్యారమ్స్, తదితర ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు ఆటల్లో పోటీతత్వాన్ని పెంపొందిచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, వరంగల్ జిల్లా సంక్షేమాధికారి రాజమణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, వరంగల్ డీసీపీఓ రాజు, హోమ్ సూపరింటెండెంట్ శ్రీదేవి, జువైనల్ బోర్డు సభ్యులు సుభాష్, గోపికారాణి, హోమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్‌లో రక్తదాన శిబిరం

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నర్ రావత్, ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డీన్ కేవీ.సుధాకర్, రెడ్‌క్రాస్ సభ్యుడు వేణుగోపాల్ పాల్గొన్నారు. అపదలో ఉన్న వారికి రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు.

దివ్యాంగులకు పింఛన్ పెంచాలి

హన్మకొండ: ఎన్నికల హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెంచాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు వికలాంగుల పింఛన్ నెలకు రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను మంద కుమార్ మాదిగ ప్రారంభించి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంకా పింఛన్ పెంచలేదని విమర్శించారు. ఈ డిమాండ్ సాధనకు ఈనెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28, 29వ తేదీల్లో రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈమేరకు సదస్సు బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, సోషియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, అధ్యాపకులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, అధ్యాపకులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ రమేశ్, సుభాష్, సాహితి, పూర్వ పరిశోధకులు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రవణ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.